## క్లుప్తంగా

### హనుమాన్ ఆలయంలో హోమం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

**ఆమనగల్లు:** కార్తీకమాసం ముగింపు సందర్భంగా జంగారెడ్డిపల్లి గ్రామం హనుమాన్ దేవాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గణపతి పూజ, హోమం తదితర పూజా క్రతువులు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీసీ జాతీయ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, మున్సిపల్ కౌన్సిలర్ కృష్ణయాదవ్, నాయకులు యాదయ్య, పాండు, బాస్కర్, కృష్ణ, మల్లేశ్, అల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు ఇర్విన్ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

**మాడ్గుల:** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన చెకుముకి సైన్స్ పోటీల్లో రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఇర్విన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం ప్రధానోపాధ్యాయుడు పర్వతాలు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### అంధుల ఆశ్రమానికి ఆర్థికసాయం



సహాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

**ఇబ్రహీంపట్నం:** అంధుల ఆశ్రమానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం అందజేశారు. చర్లపటేల్‌గూడ గ్రామానికి చెందిన 1999–2000 విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థులు.. వినోబానగర్‌లోని స్ఫూర్తి జ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అంధుల ఆశ్రమానికి సోమవారం రూ.20 వేలను అందజేశారు. అన్నదానం అనంతరం.. అంధులతో మాటామంతి చేశారు. కార్యక్రమంలో బాల్యమిత్రులు సంతోష, రవి, సమత, గణేశ్, పద్మ, మంజుల, లక్ష్మి, శ్రీకాంత్, కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

### పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్ష



కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**ఆమనగల్లు:** ప్రభుత్వ ప్రజాపాలన, ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ పరీక్షిత్ నరేందర్ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నిషియన్ వేణు రక్త పరీక్ష చేశారు. అనంతరం అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వసంత, వైద్య సిబ్బంది తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముర్తుజపల్లి గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు.

### పరువు హత్యపై కేవీపీఎస్ నిరసన

**ఇబ్రహీంపట్నం:** కానిస్టేబుల్ నాగమణి హత్యను నిరసిస్తూ కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు సామేల్, ఆనంద్, ఎల్లేశ్, జంగయ్య, బుగ్గరాములు, యాదగిరి, ప్రభుదాసులు మాట్లాడుతూ.. రాయపోల్ గ్రామానికి చెందిన నాగమణి, అదే ప్రాంతానికి చెందిన బి.శ్రీకాంత్‌తో కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారని తెలిపారు. ఇది ఇష్టంలేని ఆమె సోదరుడు పరమేశ్.. యువతిని హత్య చేశాడని ఆరోపించారు. తక్కువ కులం వాడిని పెళ్లి చేసుకుందన్న కక్షతో ఆమెను చంపిన నిందితున్ని, ప్రోత్సహించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శ్రీకాంత్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో శంకర్, చరణ్, శ్రీకాంత్, వంశీ, వినయ్, రాఘవేందర్, నర్సింహ్మా పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం పక్కదారి

**ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా.. తెల్ల రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న రేషన్ పక్కదారి పడుతోంది. నాణ్యత లేదని, ముక్కినవి, వాసన వస్తున్నాయనే సాకుతో లబ్ధిదారులు బియ్యాన్ని వ్యాపారులకు రూ.12లకు విక్రయిస్తుండగా.. కొందరు వ్యాపారులు పౌల్ట్రీఫాంలు, హోటళ్ల నిర్వాహకులకు రూ.25 ఆపై ధరలకు తెగనమ్ముకుంటున్నారు. ఇంకొందరు దూర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.**

- వ్యాపారులకు విక్రయిస్తున్న లబ్ధిదారులు
- పౌల్ట్రీఫాంలకు అమ్ముకుంటున్న వ్యాపారులు
- తరలిపోతున్న వందలాది క్వింటాళ్ల రైస్
- పల్లెచెల్కతండా కేంద్రంగా అక్రమ దందా



యాచారం పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం (ఫైల్)

**యాచారం:** నిరు పేదలకు తెల్లరేషన్ కార్డు ద్వారా ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుండగా.. లబ్ధిదారులు వాటిని దుర్వినియోగం చేస్తున్నారు. మండల పరిధి 24 గ్రామాల్లో 441 అంత్యోదయకార్డులు, 12,950 ఆహారభద్రత లబ్ధిదారులు ఉన్నారు. అంత్యోదయ లబ్ధిదారులకు 15,435 క్వింటాళ్లు, ఆహారభద్రతకార్డు దారులకు 269.475 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా అవుతుండగా.. ఏ నెలకు ఆ నెల కొందరు అర్హులు రేషన్ తీసుకుని వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. మరి కొందరు రేషన్ డీలర్‌కే వదిలేస్తున్నట్లు సమాచారం.

**పౌల్ట్రీఫాంలు, హోటళ్లకు..**

లబ్ధిదారుల నుంచి వ్యాపారులు రేషన్ బియ్యం సేకరిస్తూ.. కోళ్ల పెంపకం నిర్వాహకులకు విక్రయిస్తున్నారు. అత్యధికంగా మండల పరిధి మంతన్‌గౌరెల్లి, చింతపట్ల, మాల్, నందివనపర్తి, యాచారం, గునుగల్, చింతుల్ల, అయ్యవారిగూడెం, కుర్మిద్ద, నక్కర్తమేడిపల్లి, నస్దిక్‌సింగారం, గునుగల్, నల్లవెల్లి, కొత్తపల్లి, తక్కళ్లపల్లి తదితర గ్రామాల్లోని లబ్ధిదారులు రేషన్ బాగాలేవన్న సాకుతో అమ్ముకుంటున్నారు. వ్యాపారులు సైతం దీనినే అవకాశంగా తీసుకుని, ముందస్తుగా రేషన్ లబ్ధిదారులకు డబ్బులు చెల్లిస్తూ.. ఒకేసారి పెద్దమొత్తంలో బియ్యం తీసుకెళ్తున్నారు. కొన్ని గ్రామాల్లో వ్యాపారులు సేకరిస్తుండగా.. పౌల్ట్రీఫాంలు అధికంగా ఉన్న మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, తమ్మలోనిగూడ, చౌదర్‌పల్లి, తక్కళ్లపల్లి, మల్కీజ్‌గూడ, నక్కర్తమేడిపల్లి తదితర గ్రామాల్లో బీహార్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలకు చెందిన కూలీలు అధికంగా ఉన్నారు. వారికి భోజనానికి బదులు రెండు పూటలా రొట్టెలు తినే అలవాటు ఉండడంతో కిలో బియ్యానికి రూ.25 నుంచి రూ.30 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. పిండిగా మార్చుకుని చపాతీలు చేసుకుంటున్నారు. హోటళ్ల యజమానులు కూడా ఈ పీడీఎస్ రైస్‌ను కొనుగోలు చేస్తూ.. ఇడ్లీ, దోశలకు వినియోగిస్తున్నారు.

### పట్టుబడితే సరే.. లేకపోతే!

రేషన్ బియ్యం అక్రమ దందా పల్లెచల్కతండా కేంద్రంగా సాగుతోంది. కడ్తాల్ మండల పరిధి పల్లెచెల్కతండా.. యాచారం మండల పరిధి నక్కర్తమేడిపల్లి గ్రామానికి ఆరు కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. మండలం నుంచి అక్రమంగా రేషన్ తరలిస్తుండగా 2023లో మూడు కేసులు నమోదు కాగా 15 క్వింటాళ్ల బియ్యం పట్టుబడింది. 2024లో 16 కేసులు, 80 క్వింటాళ్ల బియ్యాన్ని యాచారం, గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ దందాలో పట్టుబడిన వారిలో అత్యధికంగా పల్లెచల్కతండాకు చెందిన వారే ఉన్నారు. వీరే ఎక్కువగా.. మండల పరిధి గ్రామాల నుంచే కాక మాడ్గుల, కడ్తాల్ తదితర మండలాల నుంచి అక్రమంగా బియ్యం సేకరిస్తున్నారు. పోలీసులకు దొరికితేనే పట్టివేత, లేకపోతే ఎన్ని క్వింటాళ్ల బియ్యం తరలిపోతున్నాయోనన్న అనుమానం అధికారుల్లో సైతం మొదలైంది.

### నిఘా ఏర్పాటు చేశాం



బియ్యం తరలిపోకుండా నిఘా ఏర్పాటు చేశాం. రేషన్ అత్యధికంగా ఆటోలు, బొలెరో తదితర వాహనాల్లోనే తరలిపోతుంటాయి. నిరంతరం సోదాలు చేపట్టి, బియ్యం పట్టుకుంటున్నాం. బాధ్యులపై కేసులు నమోదు చేస్తున్నాం. పట్టుబడిన బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారులకు అప్పగిస్తున్నాం.

– నర్సింహారావు, సీఐ, యాచారం

### తినడానికని ఇస్తే..



తినడానికని నిరు పేదలకు ప్రభుత్వం బియ్యం సరఫరా చేస్తుంటే.. లబ్ధిదారులు వాటిని అమ్ముకొంటున్నారు. ఇది సరైంది కాదు. అలాంటప్పుడు ఆహారభద్రత కార్డులెందుకు ఇవ్వాలి. పీడీఎస్ బియ్యం అమ్మినా, కొనుగోలు చేసినా చట్ట విరుద్ధమే. వాటిని దుర్వినియోగం చేయొద్దు. నాణ్యతతో కూడినవే పంపిణీ చేస్తున్నాం.

– అయ్యప్ప, తహసీల్దార్, యాచారం

# పెండింగ్ జీతాలు చెల్లించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**తలకొండపల్లి:** ఎస్సీ,ఎస్టీ సంక్షేమ వసతి గృహాల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ జల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ.. 9 నెలలుగా కార్మికులకు ప్రభుత్వం జీతాలు చెల్లించడం లేదని పేర్కొన్నారు. కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ హాస్టళ్ల ప్రధాన కార్యదర్శులు సోములా నాయక్, సురేష్, సీఐటీయూ నాయకులు లక్ష్మయ్య, బాలమణి, పెంటయ్య, ఈరమ్మ, శోభ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే షురూ



ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

**అబ్దుల్లాపూర్‌మెట్:** జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే ప్రారంభం అయింది. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసన్నలక్ష్మి అధ్యక్షతన చేపట్టిన ర్యాలీలో లెప్రసీ జిల్లా అధికారి డాక్టర్ పాపారావు, జిల్లా ఉప వైద్యాధికారి సుధామాధవి, సులోచన, లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీ నుంచి 15వ వరకు నిర్వహించే సర్వేలో ఆశ వర్కర్లు.. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 9గంటల వరకు కేటాయించిన ఇళ్లను సర్వే చేసి, వ్యాధి గ్రస్తులను గుర్తించాలని సూచించారు. అనంతరం వివరాలను పీహెచ్‌సీలో అందజేయాలని తెలిపారు. అనుమానితులకు డీపీఎంతో పరీక్షలు చేయించి, వ్యాధి నిర్ధారించి చికిత్స అందజేస్తామని వెల్లడించారు.

# ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం తగదు

**యాచారం:** ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం తగదని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి, డ్రైనేజీ సమస్యలు లేకుండా పర్యవేక్షించాలని ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు చెప్పారు. కూలీలకు చేతి నిండా పని కల్పించేందుకు కృషి చేయాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. విద్యుత్ సమస్యలు, ధాన్యం కొనుగోళ్లలో సమస్యలు రాకుండా చూడాలని సంబంధిత అధికారులకు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ అయ్యప్ప, మండల వ్యవసాయాధికారి రవినాథ్, ఈజీఎస్ ఏపీఓ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్**

**కడ్తాల్:** వ్యవసాయాన్ని పండుగ చేసి, రైతును రాజు చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా సోమవారం మండల పరిధి మైసిగండిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పార్టీ శ్రేణులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాది పాలనలో ప్రభుత్వం రూ.21 వేల కోట్లతో రూ.2లక్షల లోపు రుణమాఫీ చేసిందని తెలిపారు. రైతు సంక్షేమం పనిచేస్తున్న కాంగ్రెస్‌ను ప్రజలు ఆశీర్వాదించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, యూత్ మండల అధ్యక్షుడు హీరాసింగ్, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, నాయకులు తులసీరాం, స్టాలిన్‌కిషన్, వినోద్, రమేశ్, సుధీర్, చత్రు, సుమన్, లాల, నరేశ్, అమర్‌సింగ్, రాము, సునీల్‌కుమార్, మల్లేశ్, చందులాల్, చిన్న ఉన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మన బాధ్యతే

- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి
- ఏపీడీ గౌతమ్



మొక్కల పెంపకంపై శిక్షణ ఇస్తున్న అధికారులు

**తలకొండపల్లి:** పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి, పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చేవెళ్ల క్లస్టర్ ఏపీడీ గౌతమ్ అన్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని వృక్ష సంపదను పెంచేందుకు బాధ్యతగా స్వీకరించాలని కోరారు. సోమవారం మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వన నర్సరీలో ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రామచంద్రయ్యతో కలిసి ఫీల్డ్ అసిస్టెంట్, ఈసీ, పంచాయతీ కార్యదర్శులకు మొక్కల పెంపకంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఎర్రమట్టి, నల్లమట్టి, ఎరువులను జల్లెడ పట్టి 1:2:1 నిష్పత్తిలో మిశ్రమం చేయాలని సూచించారు. బ్యాగ్‌లో మట్టి నింపే విధానం, చిన్న మొక్కలను తీసి పెద్ద బ్యాగ్‌లో పెట్టే విధానం, ప్రైమరీ బెడ్ చేసే విధానం, మొక్కలను ఎలా సంరక్షించాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఏపీడీ మాట్లాడుతూ.. 2025–26 జూన్ వరకు నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీలో తప్పని సరిగా 10వేల చొప్పున మండల పరిధి 32 జీపీ నర్సరీల్లో 3.20లక్షల మొక్కలు పెంచడలే లక్ష్యంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. నిర్లక్ష్యం చేసినా, లక్ష్యం నెరవేరకపోయినా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. మొక్కల సంరక్షణ బాధ్యత ఉపాధిహామీ సిబ్బందిదేనని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఏపీఓ కృష్ణ, ఎంపీఓ రఘు, ఈసీ కృష్ణ, ఎఫ్ఏలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### చదువుతో పాటు ఆటల్లో రాణించాలి

**ఇబ్రహీంపట్నం రూరల్:** చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్ అన్నారు. సోమవారం మండలం పరిధి తులేకలాన్ గ్రామంలో ఎంఆర్‌ఆర్ యవసేన ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే సహకారంతో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సత్తు శశాంక్‌రెడ్డి, కోడూరి పాండు, జంగయ్య, బోడ మహేందర్, సామ తిరుమల్‌రెడ్డి, బండి దాసు, బన్నీ, వెంకటేశ్, పాండు, వీరేష్, శివ, కోర్వి శివ, రమేష్ పాల్గొన్నారు.

### నూతన నియామకం

**యాచారం:** ఎమ్మార్పీఎస్ మాదిగ ఉద్యోగుల మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. సీనియర్ నాయకుడు బోసుపల్లి ప్రతాప్ ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా నల్లవెల్లి గ్రామానికి చెందిన జిల్లా జంగయ్య, గౌరవ అధ్యక్షుడిగా మస్కు యాదయ్య, ఉపాధ్యక్షుడిగా మూలి ఎలీష, ప్రధాన కార్యదర్శిగా మస్కు జంగయ్య, కార్యదర్శులుగా కనుక యాదయ్య, కొమ్ము ఎల్లయ్య, ప్రధాన సలహాదారులుగా కాల సాయిలు(విశ్రాంత తహసీల్దార్)లను నియమించారు. కార్యక్రమంలో బాల్‌రాజు, పరమేష్, యాదయ్య, శ్రీకాంత్, ముత్యాలు, మహేశ్, నవీన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# దళితబంధు దేశానికే ఆదర్శం



దళితబంధు లబ్ధిదారున్ని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**

**కడ్తాల్:** దళితుల అభ్యున్నతికి బీఆర్‌ఎస్ హయాంలో అమలు చేసిన దళితబంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. వారి జీవితాల్లో వెలుగులు నింపిందని తెలిపారు. మండల పరిధి మక్తమాధారం గ్రామానికి చెందిన అక్కారి శివ.. దళితబంధు నిధులతో ఏర్పాటు చేసుకున్న టెంట్‌హౌస్, చికెన్ సెంటర్‌ను జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తాతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్బండ వర్గాల సంక్షేమానికి కేసీఆర్ కృషి చేశారని పేర్కొన్నారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని, అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. అధికార పార్టీ నాయకులు, ప్రతిపక్షాలను విమర్శించడం మానుకుని, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. మాజీ సర్పంచ్‌లు సులోచన, హరిచంద్, శంకర్‌నాయక్, మాజీ ఎంపీటీసీ మంజుల, నాయకులు సాయిలు, చంద్రమౌళి, గణేశ్, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, మహేందర్‌గౌడ్, చందు, చెన్నయ్య ఉన్నారు.

### నేతల పరామర్శ

**కడ్తాల్:** మండల కేంద్రానికి చెందిన వార్డు మాజీ సభ్యురాలు కేశని సత్యమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథనాయక్ సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సత్యమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, మహేశ్, యాదయ్య, లాయక్‌అలీ, దశరథం, జంగయ్య, వెంకటేశ్, శ్రీను, శ్రీరామ్, జగన్ ఉన్నారు.

### కొత్త వ్యక్తులతో జాగ్రత్త



వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ నర్సింహారావు

**యాచారం:** కొత్త వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సీఐ నర్సింహారావు సూచించారు. మండల కేంద్రంలో సోమవారం రాత్రి ఆయన స్థానిక వ్యాపారులతో మాట్లాడారు. దుకాణాలకు వచ్చే కొత్త వ్యక్తులు, రోడ్లపై సంచరించే అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌కు యువత బానిస కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఫార్మాసిటీ పీఎస్ పరిధిలో..**

యువత మద్యం, గంజాయికి బానిసగా మారొద్దని సీఐ లిక్కి కృష్ణంరాజు అన్నారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పరిధి నక్కర్తమేడిపల్లి గ్రామంలో ఆయన స్థానికులతో మాట్లాడారు. ప్రజలు కలిసి కట్టుగా ఉండాలని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఇళ్లకు తాళాలు వేసి, విలువైన బంగారు నగలు, నగదును వెంట తీసుకెళ్లాలని చెప్పారు. సీసీ కెమోరాలు అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ తేజంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### అక్రమ కేసులు ఎత్తివేయాలి

**ఇబ్రహీంపట్నం:** గురుకుల విద్యార్థుల సమస్యలపై అధ్యయనం చేస్తున్న కమిటీ సభ్యులపై కేసులు పెట్టడం సమంజసం కాదని, పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు జగదీశ్, మున్సిపల్ అధ్యక్షుడు శివసాయికిరణ్, మంచాల మండల అధ్యక్షుడు ప్రవీణ్‌నాయక్‌లు డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో గురుకులాల అధ్యయన కమిటీ శేరిగూడ, కేజీబీవీ హాస్టళ్లను పరిశీలించి, విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటుంటే.. వారిపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదేశానుసారం డిసెంబర్ 7 నుంచి నియోజకవర్గంలోని ప్రతి హాస్టల్‌ను పరిశీలించి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నేతలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్వీ నాయకులు అశోక్, రంజిత్, రవిగౌడ్, భాను, ధర్మనాయక్, అరుణ్, మణికంఠ గౌడ్ పాల్గొన్నారు.

### ఘనంగా విద్యా దినోత్సవం

**తలకొండపల్లి:** ప్రజా పాలన దినోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఆటలు, పునరుత్పాదక ఇంధన వనరుల అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఎంఈఓ చాంప్ల నాయక్, ఎంపీడీఓ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యాభివృద్ధి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని తెలిపారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



అంబేడ్కర్, భగత్‌సింగ్ విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- భగత్‌సింగ్, అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

**కడ్తాల్:** ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని, అన్ని వర్గాల సంక్షేమాభివృద్ధికి ప్రభుత్వం పనిచేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన కమ్యూనిటీ హాలు, అంబేడ్కర్, భగత్‌సింగ్ విగ్రహాలను స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సమాజంలో వెనుకబడిన కులాలు ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్.. సేవా సంఘానికి రూ.51 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గీత, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, సంఘం అధ్యక్షుడు లక్ష్మయ్య, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, మాజీ సర్పంచ్‌లు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

### విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

**ఆమనగల్లు:** విద్య, వైద్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధి లబ్ధిదారులకు సీఎం సహాయనిధి పథకం కింద మంజూరైన చెక్కులను.. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రజాపాలన చేస్తుందని, దీనిని ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. పేద బిడ్డలకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్య, మాడ్గుల డెయిరీ చైర్మన్ సాయిరెడ్డి, నాయకులు జగన్, రవీందర్‌నాయక్, కొండల్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.